# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ అంతరిక్షం, కృత్రిమ మేథ రంగంలో భారత దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు.
- ❖ రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు ప్రారంభమైన గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి.
- ❖ రిజిస్ట్రేషన్ శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

======================

అంతరిక్షం, కృత్రిమ మేథ రంగంలో భారత దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఈరోజు ప్రధానమంత్రి “మన్ కీ బాత్” 119వ సంచిక కార్యక్రమంలో మాట్లాడుతూ... సాంకేతిక రంగాల్లో యువత భాగస్వామ్యం పెరగడంలో కొత్త మార్పులు చోటుచేసుకుంటున్నాయని అన్నారు.

(వాయిస్ 25 సెకన్లు)

======================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఈరోజు విశాఖపట్నంలోని భారతీయ జనతా పార్టీ నిర్వహించిన కేంద్ర బడ్జెట్ పై మేధావుల సమావేశంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. “సబ్ కా సాత్.. సబ్ కా వికాస్.. సబ్ కా విశ్వాస్..” లక్ష్యంగా కేంద్రం బడ్జెట్ రూపొందించిందని తెలిపారు. బడ్జెట్లో అన్ని రకాలుగా సమతుల్యత పాటిస్తూ.. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి బడ్జెట్ లో భారీగా కేటాయింపులు చేశారన్నారు. విశాఖ రైల్వే డివిజన్ కార్యాలయానికి అనుమతులు ఇవ్వటమే కాకుండా పనులను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో విశాఖపట్నంలో ఏఐ సెంటర్

ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కు పూర్వం వైభవం తీసుకువచ్చే లక్ష్యంలో భాగంగా వైజాగ్ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు 11 వేల 440 కోట్లు ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

రాష్ట్రం వ్యాప్తంగా ఈరోజు ప్రారంభమైన గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు మెయిన్స్ తొలి పేపర్ జరగగా, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల వరకు రెండో పేపర్ నిర్వహించారు.. రాష్ట్ర వ్యాప్తంగా 175 పరీక్షా కేంద్రాలలో, మొత్తం 92 వేల 250 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు.

======================

అంతర్జాతీయ స్కేటింగ్ లో బంగారు పతకం విజేత జెస్సీ రాజ్ ను ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ అభినందించారు. ఏలూరు క్యాంపు కార్యాలయంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ను స్కేటింగ్ క్రీడాకారిణి జెస్సీ రాజ్ తన తల్లిదండ్రులతో ఈరోజు మర్యాద పూర్వకంగా కలిశారు. స్కేటింగ్ లో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తాను సాధించిన విజయాలను ఎంపీకి వివరించిన ఆమె, ఒలంపిక్స్ లో బంగారు పతకం సాధించడమే తన జీవితాశయం అని తెలిపారు. ఈ సందర్భంగా న్యూజిలాండ్‌లో జరిగిన వరల్డ్ స్కేట్ ఓషియానియా పసిఫిక్ కప్ ఛాంపియన్‌షిప్ లో బంగారు పతకం కైవసం చేసుకొన్న ఆమెను ఎంపీ అభినందించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ ను అందుకున్న క్రీడాకారిణి జెస్సీ రాజ్ ఏలూరు జిల్లాకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చారని కొనియాడారు.

విరామం

======================

రిజిస్ట్రేషన్ శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఈరోజు గుంటూరులో ఆంధ్ర ప్రదేశ్ సబ్ రిజిస్ట్రార్ల అసోసియేషన్, రిజిస్ట్రేషన్, స్టాంపులు శాఖ ఉద్యోగుల సంఘం సంయుక్త సర్వసభ్య సమావేశంలో మంత్రి పాల్గొని డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రజలతో మమేకమై ఉద్యోగులు మంచి సేవలు అందించి ప్రభుత్వానికి పేరు తీసుకురావాలని కోరారు. ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేసే విషయంలో ఒక స్పష్టమైన విధానాన్ని తీసుకువస్తామని తెలిపారు. రిజిస్ట్రేషన్ల శాఖకు వీలైనంత త్వరగా కొత్త బిల్డింగులు నిర్మించనున్నామని మంత్రి సత్య ప్రసాద్ వివరిస్తూ..

(వాయిస్ 33 సెకన్లు)

======================

ప్రతినెల చివరిలో ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహించే "మన్ కీ బాత్" కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో విశేష స్పందన లభిస్తోంది. ఈ రోజు జరిగిన 119వ సంచిక కార్యక్రమాన్ని అనంతపురం జిల్లా ప్రజలు, యువత ఎంత ఆసక్తిగా విన్నారు. ఈ సంచికలో ప్రధానంగా ప్రపంచంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టుతున్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ గురించి, జంతు సంరక్షణ, క్రీడా స్ఫూర్తి, విద్యార్థుల కోసం పరీక్ష పే చర్చా లాంటి ఎన్నో ఉపయోగకర విషయాలను ప్రధానమంత్రి ప్రజలకు వివరించారన్నారు. ప్రధానమంత్రి సూచనలు సలహాలను పాటిస్తామని అనంతపురం వాసి రత్నమయ్య తెలుపుతూ...

(వాయిస్ 24 సెకన్లు)

=======================

దివంగత మాజీ కేంద్రమంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు 68వ జయంతి కార్యక్రమాన్ని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో ఈరోజు ఘనంగా నిర్వహించారు. ఎర్రన్నాయుడు భార్య విజయమ్మతో కలసి ఆయన కుమారుడు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తదితరులు ఆయనకు నివాళి అర్పించారు.

ఎర్రన్నాయుడు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ప్రజా సేవలో తిరుగులేని నిబద్ధత, నిజాయితీ, ఆత్మీయత కలబోసిన నాయకుడు ఎర్రన్నాయుడు అని సామాజిక మాధ్యమంలో ముఖ్యమంత్రి కొనియాడారు.

=======================

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యునిగా దేవాదాయ శాఖ సెక్రటరీ వి.వినయ్ చంద్ ఈరోజు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. టీటీడీ అదనపు కార్యనిర్వహణ అధికారి సి.హెచ్. వెంకయ్య చౌదరి వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. వి.వినయ్ చంద్‌కు శ్రీవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు భాస్కర్, ప్రశాంతి, వీజీవో సురేంద్ర పాల్గొన్నారు.

=======================

ఇంటర్మీడియట్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అవసరమైన అన్నీ చర్యలు చేపడుతుందని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఈరోజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 1 నుండి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు 30 వేల 652 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని చెప్పారు. ఇందులో మొదటి సంవత్సరానికి సంబంధించి 15 వేల 482 మంది ఉన్నారని తెలిపారు.

=======================
=======================